కథానిక:

# రుధిరపూజ

త్రిలోకేశ్వరుడి ఆలయం!

విశ్వకర్మ ఎనలేని ప్రయాస కోర్చి తనే స్వతః కట్టాడట.

ఎవరో సూర్యవంశ చక్రవర్తి పరిపాలనలో హనుమంతుడే ఆ మందిరానికి రాళ్లు మోశాడని ప్రతీతి.

చరిత్రకారులు: "యీ ఆలయం 'కిరాతుల' చేత కట్టబడింది. యీ దేవత కిరాతులది" అన్నారు. ప్రజ లిలా అనుకొంటూండడం పరిపాటి.

ఒకసారి మహాయుద్ధంలో ఆ దేశం అపజయం పొందింది. ఆలయం నాల్గుగోడలు యథేచ్ఛగా మానవ రుధిరంతో చిందులాట జరిపించుకున్నాయ్... దేవతకు క్రొత్త నామకరణం క్రొత్త ఆవరణలో ప్రతిష్ఠాపన జరిగి తిరిగి జీవకళ దక్కించుకున్నారు.

ఏళ్ల తరబడి ఏ ఒడిదుడుకూ లేకుండా ప్రశాంతంగా ప్రవహిస్తూన్న భక్తివాహిని నేటినించి మరో దిక్కుకు మరల సాగింది!

'కిరాతులు' అంటరానివాళ్లైరి, సెలయేటి ఎదురు గట్టున దూరంలో అతిదూరంలో— వారి కొంపలు. వారి హృదయాంతరాళాల్లో భక్తిప్రభావం ప్రచ్ఛన్నంగా దాగుంది. కానైతే వారికోసం ప్రత్యేకంగా ఆలయాలు వున్నవి కావు. భగవన్నామస్మరణ - భజన యిత్యాది భగవత్కైంకర్య సాధకములన్నీ వారికి వుగ్గుపాలతోనే, అలవడినవే. అయితే నలుగురెదుటా నుడవటానికి నాలిక లేదు. కృష్ణశిలలో తమ పని తన మూలకంగా జీవకళను సర్వోత్కృష్టంగా నింపడం వాళ్లకు తెలుసు. కాని పాలకవర్గంమాత్రం వారు కారు.

శుచిగా శుభ్రంగా వుండడానికి వారికాస్పదం లేదు. పుస్తకాల్లోంచి శ్రమకోర్చి జ్ఞాన మార్జించుకోడానికి వారికధికారం లేదు.

పశ్చిమదిక్కులో త్రిలోకేశ్వరుడి బంగారుప్రతిమ ముఖభాగం ధగధగమని కాంతులీనుతోంది. దానినుంచి దూరంగా-అతిదూరంగా తప్పుకు నిల్చుని దర్శనం చేసుకోవాలి. మనస్సులో— మౌనంగా శిరస్సువొంచి ధ్యానించడానికి మాత్రం వారికధికారముంది. యీ అధికారాన్ని ఎవరూ ఆక్షేపించలేరు కదా!

ఆలయంలో దిక్కులు పిక్కటిల్లేటట్టుగా పెద్ద గంటలు - ఢంకాలు - నగారా నౌబతులు మ్రోగుతున్నాయి.

దారిపొడుగునా ఇరుప్రక్కల వివిధ వస్తు సామగ్రి నమ్ముతూన్న అంగళ్లు.

వినేవారు పురాణ శ్లోకాలను భక్తి ప్రపత్తితో వింటూన్నారు. మరోచోట సంకీర్తన జరుగుతోంది గుంపుగా.

కాకి బంగారంలా తెల్లగా మెరిసే దుస్తులతో అలంకరించుకున్న రాజభటులు ఆలయం చుట్టూ కాపలాలో వుంటున్నారు.

ముందు ముందు మంగళవాయిద్యాలు. వెనుకనించి కళ్లు మిఱుమిట్లుగొలిపే శృంగారవిహారంతో, అత్యంత విజృంభణతో ఏనుగులమీద వరుసబారి సాగివస్తూన్నారు రాజకుటుంబం వారంతా.

ఎక్కడా జన సమూహం; ఒకటే గోల.

భక్తుల నోటినుండి 'జై త్రిలోకేశ్వరా' అంటూ వెలువడుతూన్న నినాదం అక్కడి గాలిలో పూర్తిగా విలీనమైపోయి, మరికొద్ది దూరందాకా ప్రసరింపబడుతోంది.

రేపు చతుర్దశి రోజు. రాజుగారు 'సభ పూజ' నాంది హారతులివ్వడంకోసం ఎంతో వైభవంతో - ఉత్సాహంతో పట్టపుటేనుగుపై ఆసీనులై తరలి వొస్తూన్నారు. అందుకోసమే ఆ దోవ కిరుప్రక్కల పచ్చటి తోరణాలు కట్టేరు. ముచ్చటగా సింగారించారు.

త్రయోదశి మొదటి ఝామం హారతి సూచిస్తూ ఆలయంలోని గంటానాదం వినబడింది. ఢంకా మ్రోగింది.

ఇవ్వాళ చంద్రుడి మొహంలో ఔదాసీన్యత!

*    *    *

అనుసరణ:

శ్రీ కొంకనహారు శేషగిరి

మసక మసకగావున్న వెన్నెల.

మౌనం—భీకర మౌనం!

ఒక్క ఆకు కూడా కదలాడిన శబ్దం లేదు.

గాలి అంతకంటే మౌనంగా వుంది.

ఆకాశంలో దట్టంగా మంచు కప్పుకుంది. ఏ కారణం లేకుండా వీధి కుక్కలు మొఱ్ఱో మని ఏడుస్తున్నాయి.

కానరాని దిక్కువంకకు చెవులు నిక్కపొడుచుకుని ఏవిటోగాని వింటున్నాయి——గుఱ్ఱాలు.

ఒక్కసారి అనుకోని విధంగా భూమి అంతర్భాగంలో భయానకమైన—భీకరమైన శబ్దం వినిపించింది. పాతాళలోకంలోని నాగ సంతతంతా భయంకర రణగుణధ్వని చేస్తున్నట్టు!—విజయభేరీ మ్రోగిస్తూన్నట్టు!

భూమి 'ఫెడీ' మన్న కఠోరశబ్దంతో పగిలింది. గడ-గడ శబ్దం—బహు వ్యాప్తమయ్యింది. కాళ్లు కట్టి బంధించిన ఏనుగ, గొలుసును ముక్కలుచేసి తెలియని దిక్కువైపు పిచ్చిగా వురక లెత్తింది.

భూకంపం!

జనసమూహమంతా తండోపతండంగా ప్రాణదేవుని—జీవం రక్షించమని అర్థిస్తూ - అర్థంలేని అఱపుల నరచుకుంటూ ఎక్కడికో, ఎటువైపో వెర్రిగా పరుగెత్తుతున్నారు. యీ సమయంలో హెచ్చుతగ్గు స్థాయిపట్ల కాని - మానావమానాలగురించిన ఆలోచన్లుగాని లేవిక—

అడుగున నిప్పులు గ్రక్కుకుంటున్న భూమిపైన దట్టమైన పొగ!

భూమి చారలు చారలుగా విడిపోయి వేడినీళ్ల ప్రవాహాలు వరదల్లా కొట్టుకు వస్తున్నాయి.

గట్లు తెగి చెఱువుల్లోని నీళ్లు నిమిషంలో మాయమైపోతే చెఱువులు కానరాని ఎన్నో చోట్ల చెఱువు లేర్పడ్డాయి!

ఆలయం నగారా ఖానలోని పెద్ద గంట తనంతట తనే కొట్టుకుంటూంది ఢణ్! ఢణ్!!

నైసర్గిక రౌద్రావతారం మెల్లిమెల్లిగా శాంతత కాస్తూంటే ధడం ధడం అన్న విపరీతశబ్దం - కర్ణకఠోరమైన శబ్దం-మరోమారు వినవచ్చింది

భూమీద మళ్లీ చల్లగాలి వీచేటప్పటికి చంద్రుడు పశ్చిమాంబుధివైపు తరలిపోతూన్నాడు. అగ్నిదేవుడి కాహుతై భగభగ మండిపోతున్న ఇళ్లనించి ఎగ్రబాకే దట్టమైన పొగ ఆ చంద్రుడి చుట్టూ ఆవరించుకుంది.

రెండోరోజు ఊరు చావుస్థితిలో వుంది-ప్రజల కనుకొలకుల్లోంచి- దుఃఖమూ-నిరాశా- భీతీ తొంగిచూస్తున్నాయి.

రాజభటులు ఆలయం పహారాకోసం బయలుదేరారు. వారివెంబడే ఆలయప్రాంగణం శుద్ధిచేయడంకోసం- పవిత్ర పరచడంకోసం- గంగాజలంతో నిండిన కడవలెన్నో-

రాజు- మంత్రి- ధురంధురుడైన జ్యోతిష్కుడు-ధర్మశాస్త్రపారంగతులైన పేరుమోసిన పండిత శ్రేష్ఠులు - ఎందరో బయల్దేరి వెళ్లేరు ...

అయితే...!

ఆలయప్రాంగణమంతా కూడా- జీర్ణభూతమైపోయింది. గోడలన్నీ నేలమట్టమై —పైభాగం దేవతామూర్తిమీద అలా కృంగిపడిపోయింది.

"వొచ్చే పూర్ణిమనాటి కల్లా సంస్కారం కావాలి. కాకపోతే దేవత కుపితురాలై మూర్తిని వదిలి వెళ్లిపోగలదు!" పండిత శ్రేష్ఠులన్నారు.

స్థిరపరుస్తూ రాజాజ్ఞ బయటపడింది... మంత్రి గుండెలు కొట్టుకోడం ఆగిపోయింది.

"ఈ పని 'కిరాతుల'కు తప్ప మరొకరివల్ల కాదు. అందుచేత వారిని ఆ కార్యంకోసం నియోగించినపుడు వారి అపవిత్ర దృష్టినుండి మూర్తిని సంరక్షించడం ఓ సమస్య. దేవతామూర్తి పావిత్ర్యం మట్టిపాలైతే ఆలయసంస్కారంనుంచి కలిగే లాభంకూడా శూన్యమే!"

రాజాజ్ఞ ప్రకారంగా మాధు-'కిరాతుల' గుంపుకు ప్రముఖుడు - సన్నిధిలో హాజరయ్యాడు. మలినమైన పంచ- చిరిగి జీర్ణావస్థలోవున్న చొక్కా- చిరుగుల్లో స్పష్టంగా అవుపించే ఉక్కుశరీరం— వయః పరిపాకానికి తగినరీతిముదరి వేలబడిన చర్మం. దైన్యతను సూచించే—సూర్యచంద్రుల్లాంటి—ఆ రెండుకళ్లూ!

విశేషగౌరవంతో తనుపట్టుకొచ్చిన ఫలపుష్పాలను సన్నిధిపాదాల కర్పిస్తూ - దూరంగా సన్నిధినోటంబడి వెలువడే ఆజ్ఞకోసం చెవులు నిక్కపొడుచుకుని వింటూ నిల్చున్నాడు.

"మాధు! నిన్నుతప్పించి దేవాలయ సంస్కారం జరగడం దుస్సాధ్యం."

"దేవత మూర్తి కరుణాకటాక్షం, ప్రభూ!" అంటూంటే ఉప్పొంగి వొస్తూన్న భక్తిభావం తనలో యిముడ్చుకోలేక వొణుకుతూన్న చేతులెత్తి దేవతకు దండంపెట్టాడు మాధు!

"దేవత విగ్రహంమీద నీ దృష్టిగాని పడకూడదు. అపవిత్రమనకూడదు. అంచేత కళ్లు గట్టిగా మూసుకునే పని పూరించాలి... సాధ్యమేనా?"

"ఆజ్ఞ మహాప్రభూ! పని పూర్తయ్యేదాకా కూడా కళ్ళు తెరవను, మూర్తిని చూడను."

ఆలయం బహిరావరణలో మాధు తన పనిలో నిమగ్నుడైవున్నాడు. నాల్గుగజాలదూరంలో మరికొందరు మనుషులుకూచుని రాళ్ళను వివిధాకారాల్లోకి చెక్కుతున్నారు.

మాధు కళ్లమీదుగా కొంచెంకూడా దృష్టి అగపడనట్లు బిగువుగా గంతకట్టేశారు: రాత్రింబగళ్లు ఆ ఆలయమే మాధు నివాసస్థానం!

చేతులు 'స్వామికార్యం' చేస్తూంటే మనస్సుభక్తిప్రఫుల్లితమై ఆ దేవత నిజస్వరూపంవద్ద నిజలోకంలో స్వైరవిహారం చేస్తోంది. ఇటు రాజభటుల తొందర త్వరగా, అతిత్వరగా చేతిలోనికార్యం పూర్తి చేసేందుకుగాను అంతింతని కాదు.

అది 'పరాత్పరుడి' కార్యావసరం! అతని కార్యాన్ని 'అతనే' చక్కబరచుకుంటాడు. అలస్యం కూడా లేకుండానే. నేను నిమిత్తమాత్రుణ్ణి. అని మృదువుగా మెల్లని కంఠంతో జవాబిస్తున్నాడు మాధు. వెన్నెలరాత్రిళ్లు సాగిపోయి యిప్పుడా స్థానాన్ని అమావాస్యానిశి గాఢాంధకారం ఆవరించుకుంది.

మాధు తన కార్యంలో నిమగ్నుడై తల్లీనుడై పోయాడు. దగ్గర ఎవ్వరూ లేరు. రాతితో మాట్లాడాలి. ఆ రాయి కనికరించి పలికి జవాబివ్వాలి...సమీపంలో, పహారా తిరిగేవ్యక్తి.

పూజారి పరుగిడుకుంటూ వొచ్చాడు.. "రేపటిరోజు ఏకాదశి, 'శుభప్రదమంచిరోజు. అసలు సుముహూర్తం వుంది. ఆ లోపుగా నీపని పూర్తవగలదా మాధూ"

"చెప్పడానికి నేనెంతటివాణ్ణి గురువుగారూ? దేవుడి కటాక్షమైనప్పుడు తనే పూర్తికాకుండా వుండగలదా? అలా ఎంత తీవ్రంగా ముగిసిపోతే అప్పుడే కబురంపించగలను..."

రోజు దొర్లింది—

ఏకాదశి తెల్లవారు మొదటి ఝాము... దేవాలయం తలుపుచాటునించి చంద్రుడి చల్లటి వెండికిరణాలు మాధు తెల్లటి వెండి జుత్తుమీద పడి దోబూచులాడుతున్నయి. పిండారబోసినట్లు దట్టమైన చంద్రకాంతి..



1 తులము టిన్నులలో అన్ని చోట్ల దొరకును.
శ్రీ అంబాళ్ అండు కంపెని,
తపాలు పెట్టె నెం. 3. మదరాసు.

మాధు ఒక దీర్ఘనిశ్వాసం వదిలి, పహరా వాడితో "వెళ్లండి, మాధు చేసేగొన్నపనీ, సంపూర్తయ్యిందని కబురుచేసిరాండయ్యా, శుభ లగ్నం కొస్త దాటిపోకూడదు, ఉస్."

పహరావాడు వెళ్లిపోయాడు. మాధుయిహ తనలోని భక్తి భావోద్రేకాన్ని అణచుకోలేక పోయాడు. పహరావాడు వెళ్ళిపోయాడు. అదే తడవుగా కళ్ళకు కట్టిన గంతను ఒక్కసారిగా ఒక్క విసురుతో విప్పితీసేశాడు... హాయిగొలిపే ఆ వెన్నెల దేవతా విగ్రహం ప్రసన్నవదనం మీద ఛాయలుగా పడుతూంటే ఆ మన మోహన దృశ్యాన్ని పరికించడానికి మాధుకు వున్న ఆ రెండుకళ్ళు చాల్లేదు!

తన్మయత్వంలో మరో లోకంలో దేవతాశక్తి పాదద్వయంముందు తనహృదయం కల్మషమెరుగని పసిపిల్లాడి హృదయం అర్పించుకున్నాడు. అదీ నిజమైన హృదయార్పణ! కళ్ళనించి ధారాపాతంగా నీళ్ళు ప్రవహిస్తూన్నాయి. ఆనందబాష్పాలు... దేవతాశక్తిమీద పరమపవిత్ర "ప్రేమ" మయ సద్భావఫలిత పరమానంద బాష్పాలు.

ఈ క్షణం జీవితంలో మరువరానిది. దీర్ఘకాలంగా సతమతమవుతున్న ఓ సద్భక్తునికి భక్తబాంధవుడు దర్శనభాగ్యాన్ని సమకూర్చేడు దీర్ఘకాలానికి.

ఆ తన్మయత్వం మహారాజు ఆలయం వైపు వేగిరంగా పరువులెత్తిరావటం ఎరగడు! కోపం మితిమీరింది. ఆజ్ఞాధిక్కరణ! శాసనోల్లంఘన!!

రాజుగారి ఒడిలోని రత్నఖచిత ఖడ్గం ఒక్కసారి ఝుళిపించింది— చంద్రకాంతిలో జిగేలుమని మెఱుపులా మెరిసింది. ఒకే ఒక్క వ్రేటు అంతే! మాధు శిరస్సు మొండెంనుండి వేరైపోయింది. వేడివేడి రుధిరం పొంగుతూ వొచ్చి నాల్గుదిశలకు చిమ్మింది.

ఇదే ఆ 'శుభపూజ' అంతిమ పరిణామం. మాధుఆయువుపట్టులోంచి పొంగిన ఆరక్తం దేవత చరణాలను అంటకపోలేదు. పాదద్వయాలనుకూడా ఎఱ్ఱగా మెరిసేట్లు చక్కగా కడిగాయి. అదే రుధిరపూజ!!

★

# ఉత్తరాలు

(11-వ పేజీ తరువాయి)

మూడో రోజు స్కూలుకి పెందరాళే వెళ్లాను. అప్పటికే ఆ కుర్రాడు వచ్చాడు. అతనూ అప్పుడే వచ్చాడు కాబోలు నా అడ్రసుగల కవరు కనబడినట్టుంది. చకచకా పోయి మహా ఆత్రంతో కవరు చింపాడు.

నేనతనికి కనబడకుండా పక్కనే ఉన్న గోడచాటున దాక్కున్నాను. అతను నన్ను గమనించలేదు.

కొంతసేపటికి ఆ ఉత్తరం అతను చదవటం పూర్తవగానే నేనక్కడికి కెళ్లాను. ఆ కుర్రాడు కవరుమీద ఉన్న పోస్టుముద్రని తీక్షణంగా చూస్తున్నాడు. అతని మొహం వాడి ఉంది.

నే వెళ్లటంతోటే అతను ఒక్కసారి నా మొహంలోకి చూసి తలదించుకున్నాడు. ఆ క్షణంలో అతనికి నా మొహంలో ఏం కనబడ్డదో గాని అసలే వాడిపోయిన అతని ముఖం నల్లగా మాడి ఉండటం నేను గమనించాను.

అతను మెల్లగా లేచి నే నడగకుండానే ఉత్తరం నాచేతి కిచ్చి బరువుగా పెద్దపెద్ద అంగలు వేస్తూ వెళ్లి పోయాడు.

ఆ ఉత్తరంలో ఇలా ఉంది.

మిత్రునికి,

మీ క్షేమంకోరి ఈ ఉత్తరం రాస్తున్న నన్ను క్షమించ ప్రార్థన.

ఈమధ్య నాకొక లేఖ వచ్చింది. నేను ఈ సంవత్సరం పరీక్షలో కృతార్థుడ నవవలెనంటే దేవుని పేరు తల్చుకొని పన్నెండు కవర్లలో, పన్నెండుగురికి, పన్నెండు లేఖలు వ్రాయవలయునని నాకు చేరిన లేఖలో ఉన్నది. (పేరు తెలియజేయ కూడదు.)

ఇంకొక సంగతి. ఈ నా ఉత్తరం చదివిన వారు తలకొక పన్నెండు లేఖల చొప్పున పన్నెండుగురికి తమ పేర్లు తెలియ పరచకుండా పన్నెండు కవర్లలో లేఖలు పంపవలయునని ఉన్నది.

అట్లు చేయనివారు పరీక్షలలో కృతార్థులవకపోవటమే గాక వారి జీవితమంతయు కష్టముల పాలయ్యెదరని నాకు చేరిన లేఖలో ఉన్నది.

ఇట్లు,
మీ మిత్రుడు

తర్వాత ఓ వారం రోజులకి నాకు మరో ఉత్తరం వచ్చింది. కాని ఆ ఉత్తరం చింపబడి ఉండలేదు. సాధారణంగా నా ఉత్తరాలు చించే కుర్రవాడు అక్కడే వరండాలో కూచుని ఉన్నాడు.

నేను ఉత్తరం తీసుకుని అతనిదగ్గర కెళ్లి నవ్వుతూ, "ఈ ఉత్తరంలో ఏముందో కాస్త చూసి చెప్పండి." అన్నాను.

అతను ముఖం చిట్లించుకుని "ఇప్పటికే రూపాయిన్నర చిలుంవొదిలింది చాలదూ?" అన్నాడు.

అప్పుడే కాదు తర్వాత మరెప్పుడన్నా సరే నేను కనబడినప్పుడల్లా ఆ కుర్రాడి ముఖం ముకుళించుకు నేది.

అది మొదలు తర్వాత మరెప్పుడూ నా పేర ఒచ్చిన కవర్లు చింపబడి ఉండలేదు.

★

## రు. 100 బహుమానం

(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్లవెంట్రుకలను అంత మొందించండి రంగులు వాడకండి. మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చుతుంది. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి. హెచ్చుగ తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు. 12) కొనండి. ఇది అబద్ధమని ఋజువుచేసిన వారికి రు 100 బహుమానం. పూర్ణ విశ్వాసానికి అణాన్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి.

**Bharat Kalyan Aushadhalaya,**
Post Bag No 6725, Calcutta. (A P)

ఆస్పత్రి నర్సు:— మీరు ఆలస్యంగా వచ్చారు. సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలకి మీ భార్య కవలపిల్లల్ని కన్నది.

భర్త:— బతికిపోయాను. రెండు గంటలవేళ గనక ఇద్దరు పిల్లలతో సరిపోయింది. పన్నెండు గంట లప్పుడయితే......?